# రవిగాంచని చోట పైరవిగాంచున్...

చలికి ఇంకా నిద్రలేవని నేను ఉదయాన్నే సిన్మా పేజీ చూస్తూ మాఆవిడ అరచిన అరుపుకి ఉలిక్కిపడి లేచాను. మరోసారి పిలిచింది.

"ఏవండోయ్... ఓసారి పేపర్ చూడండి. మీ మిత్రుడు సుకుందరావుకి విష్ణుమాయ చిత్రంలో నటనకుగాను ఉత్తమ నటుడి అవార్డొచ్చింది. అదేదో ఉల్లిపాయ మూవీ ఆర్ట్స్ సంస్థ ప్రకటించింది" అంది.

నా మనసుని తేనెటీగ కుట్టినట్టు జల్లుమంది.

సుకుందంగాడికి ఉత్తమనటుడు అవార్డా?

విష్ణుమాయ చిత్రంలోనా...?

అసలా చిత్రంలో వాడెక్కడున్నాడు? ఆ సినిమాలో పందొమ్మిది రీళ్లూ బుర్రలో గిర్రున తిరిగిపోయాయి. కాని సుకుందంగాడు కన్పడలేదు. ఇక్కడ సుకుందరావు గురించి కొంచెం ఫ్లాష్ బ్యాక్ చెప్పాలి.

కట్ చేస్తే... వాడి థియరీ ప్రకారం డబ్బు సంపాదించాలంటే రెండే రంగాలు. ఒకటి రాజకీయరంగం, రెండోది సినిమారంగం. అందులోనూ 'కళ అనునది ఒకగుల' అని భావించేవాడు. కాబట్టి సినిమాల్లో ట్రై చేద్దామని నా పెళ్లికి ముందు చెవిలో జనరేటర్ ఆన్ చేసేవాడు. కళ అనే దురద ఏ మెడిమిక్స్ సబ్బుకో, జాలిమ్ లోషన్‌కో వదలదు కాబట్టి... ఇద్దరం హైదరాబాద్‌కి బయల్దేరాం. ధరల్లో మాత్రం హైగా కన్పించే సిటీలో పాండీబజార్ లాంటి కృష్ణానగర్‌లో ఒగది అద్దెకి తీసుకొని కెమెరా రీళ్లలా తిరిగాం.

అంతటా కట్ చెప్పారు. ఏడాది తిరిగినా ఏ ఛాన్సూ రాలేదు సరికదా... కనీసం బుల్లితెర మీద కూడా పిల్లి తలకాయంత మేం కనపడలేదు. చివరికి నేను తిరిగొచ్చిన ఫిలిండబ్బాలా బ్రీఫ్‌కేస్ సర్దుతుంటే... సుకుందంగాడు ఇండస్ట్రీలో 'టైం' గురించి లెక్చరిచ్చాడు.

ఎల్.వి.ప్రసాద్ నించి... చిరంజీవిదాక.

"అంతెందుకూ... మొన్నటికి మొన్న బాపూగారి సీతాకళ్యాణం సిన్మాలో పదిమంది మేకప్ అసిస్టెంట్‌లలో ఎ.ఎం.రత్నం ఒకడు. శ్రీకాంత్ ఏంటి? పీపుల్స్ ఎన్‌కౌంటర్‌లో నెగటివ్ రోల్‌తో ఎంటరయ్యాడు. ఇప్పుడు ఊహించనంత ఎదిగిపోయాడు. రజనీకాంత్ నీలాగే అనుకుంటే కండక్టర్ నించి కంట్రోలర్‌గానే ఉండేవాడు. అలాంటిది తమిళనాడునే కంట్రోల్‌లో పెట్టే లెవెల్‌కి ఎదిగాడు. దేనికైనా తపన కావాలి, టైం రావాలి" అన్నాడు ఆవేశంగా.

"ఎవరో ఒకరిద్దరు అలా అయినంత మాత్రాన మనకూ అలాగే జరుగుతుందని గ్యారంటీ ఏమిటీ? నే వెళ్ళిపోతాన్రా" అన్నాను నిక్కచ్చిగా.

"వందమందిలో ఒక్కడే విజయం సాధిస్తాడు. మనం ఎదగడానికి ఆ ఒక్కణ్ణే స్ఫూర్తిగా తీసుకోవాలి తప్ప మిగతా తొంభై తొమ్మిది మంది గురించి ఆవగింజంత ఆలోచించినా అపజయాల పాలైపోతాం" అన్నాడు కూల్‌గా.

"ఏమోరా... నాకైతే మనకి అవకాశాలు వస్తాయన్న ఆశ ఏ కోశానా కన్పించట్లేదు. మనలాంటి 'కళాగ్రస్తులు' ఈ కృష్ణానగర్‌లో ఎన్ని అగచాట్లు పడుతున్నారో చూస్తుంటే బెంబేలెత్తుతోంది" అన్నాను నీరసంగా.

"అదే మన గ్లామర్‌ని తగ్గిస్తుంది. మనకి రెండు అవకాశాలు వచ్చాయనుకో... నిమ్మరసం తాగకున్నా నిగనిగలాడిపోతాం. సక్సెస్‌తో వచ్చే వెలుగు ఎంత తిన్నారాదు బ్రదరూ. జస్ట్ టైం రావాలి... కనీసం నెల్రోజులు ఓపిక పట్టు. డైరెక్టర్ సూర్యవంశీ సిన్మాలో కేరక్టర్స్ ఉన్నాయంట. అందుకే రేపు జూనియర్ ఆర్టిస్ట్సు సప్లయర్ బాలప్రసాద్ దగ్గరికెళ్తుతున్నాను" అన్నాడు.

"వేషమివ్వాల్సింది సూర్యవంశీ అయితే బాలప్రసాద్ దగ్గరికెందుకూ?" అనడిగాను.

"అదే బ్రదర్... రవిగాంచని చోట పైరవిగాంచున్..." అంటూ సిగరెట్ వెలిగించి బయల్దేరాడు. నేను ఆలోచనల్తో చాపమీద నడుం వాల్చాను. అరగంటలో తిరిగొచ్చిన సుకుందం 'పద...పద' అని తొందర పెట్టాడు. ఏ ప్రొడక్షన్‌లో ఏ క్యారెక్టరుందో ఎవరికి తెల్సు... బాలప్రసాద్ చెంతకీ" అనటంతో బయటపడ్డాం.

* * * *

జూనియర్ ఆర్టిస్ట్సు సప్లయర్ ఇంటికెళ్ళేసరికి అప్పుడే బయటికెల్లాడని తెలియడంతో

రెండు గంటలు ఆ ఏరియాలో తిరిగాం. ఫిలింనగర్‌లో మాలాగే వేషాల వేటలో కనపడ్డ వారిని హల్లోలతో పలకరిస్తూ... టీలుతాగుతూ... ఫ్లాప్‌ల గురించి, స్టోరీలు స్టోరీలుగా చెప్పుకుంటూ, వింటూ రెండు గంటలు గడవగానే బాలప్రసాద్ ఇంటికెళ్ళాం. ఆయన గారి భార్య ఫ్లాప్ సినిమా గురించి ఫ్లాష్ న్యూస్ చెప్పినంత చల్లగా "ఆయనిప్పుడే వచ్చారు. మరో గంటైతేగాని లేవరు. గంటాగి రండి" అంది. గంటే కదాని మళ్లీ రోడ్డున పడ్డాం. ఈ ఏడాదిలో సినిమా ముఖాలు బాగానే పరిచయమయ్యాయి కాబట్టి... ఏయే సినిమాలో ఏయే వేషాలున్నాయో ఆరా తీశాం. మళ్లీ గంట గడిచాక వెళ్తే 'ఆర్టిస్టుల్ని సప్లయ్ చేసి ఆయన బాగా అలసిపోయినట్టున్నారు. మరో గంటయితేనే కచ్చితంగా లేస్తారు" అందావిడ. ఆవిడ భార్యో జూనియర్ ఆర్టిస్టో పోల్చుకోలేకపోయాం. కడుపులో ఆకలి నకనకలాడుతోంది. సాయంత్రం కలుస్తామని చెప్పి బయటపడ్డాం.

సిటీబస్సులో నలిగిపోయి, చితికిపోయి గదికొచ్చేసరికి ఖాళీగిన్నెలు వెక్కిరించాయి. నాకైతే కడుపులో దుఃఖం పొర్లింది. కాని గదిలో పడివున్న రెండు కవర్లపై దృష్టి పడటంతో సుకుందాన్ని వంట చెయ్యమని చెప్పి కవర్లు చించాను.

ఒకటి తమ్ముడి నించి...

మరోటి నాన్ననించి...

"మీకోసం వచ్చిన సిన్మానల్లా చూస్తున్నాం. మీరెళ్లి ఏడాది దాటింది. దేంట్లోనైనా కన్పిస్తారని థియేటర్లో వత్తులు వేసుకొని చూస్తున్నాం. మీరు ఏయే సీన్మాల్లో నటిస్తున్నారో తెలుపగలరు." అంటూ కాబోయే హీరోలుగా మా గురించే కలలు కంటూ రాశాడు తమ్ముడు.

ప్చ్...

నేను నిట్టూరుస్తుండగానే "ఘుమ ఘుమలు... ఘుమఘుమలు... మామిడికాయ పచ్చడితో వంట రెడీ" అన్నాడు సుకుందం. ఆకలి, హిట్ సిన్మాలా పరగెడుతుండటంతో నాన్న లెటర్ చదవకుండానే జేబులో పెట్టుకొని గబగబా భోంచేశాం. నాన్న ఉత్తరాన్ని చదవాలంటే భయం. దాంట్లో అన్నీ తిట్లే వుంటాయి. అందుకని ఇంట్రస్టు రాలేదు. సాయంత్రం కాగానే మళ్లీ జూ.ఆ.స బాలప్రసాద్ దగ్గరికి పరగెత్తాం. సుకుందం గాడికి పరిచయం కాబట్టి పలకరించాడు. వేషాల గురించి పెదవి విరిచాడు. చివరికి మేం కాళ్లావేళ్లా పడ్డంత పనిచేయటంతో 'విష్ణుమాయ' చిత్రంలో డైరెక్టర్‌ని ఒప్పించి సుకుందం ఒక్కడికి వేషం ఇప్పించడానికి ఒప్పందం కుదిరింది.

నా మనసు ఫ్లాప్ సిన్మా ప్రొడ్యూసరైపోయింది. నీరసంగా గదికి వచ్చి నాన్న రాసిన లెటర్ తెరిచాను.

"విశ్వ విఖ్యాత నటసార్వభౌములకి... నమస్కారములు.

మన ఇంటావంటాలేని వేషాల పిచ్చి ఎలా తగిలిందిరా అప్రాచ్యుడా... నువ్వు

కడుపులో ఉండగా మీ అమ్మనేదో సిన్మాకి తీసికెళ్లినట్టు గుర్తు. అదే ఇంతదూరం వచ్చినట్టుంది. ఇంకా వెండతెర మీద తమరి బంగారు ముఖారవిందం కన్పించి చావదుగానీ, పెట్టేబేడా సర్దుకొని వెంటనే వచ్చెయ్.

నీకు పెళ్లి సెటిల్ చేసాను.

అమ్మాయిని ప్రీతిజింటాలాగానో, అంజలా జవేరీలాగానో ఊహించుకోకు. ఫర్లేదు. బాగానే ఉంటుంది. మీ మామ జగిత్యాలలో ఫైనాన్స్ పెట్టి, మూసేసి, జనాల కొంపలు ముంచి బాగానే సంపాదించాడు. కట్నం కూడా లక్షరూపాయలిస్తున్నారు. వచ్చే నెల ఆరో తేదీన నీ పెళ్లి... వచ్చి తగలడు. మీ... నాన్న"

ఉత్తరం చదివి నవ్వాలో, ఏడ్వాలో అర్థంకాలేదు. కానీ ఇక్కడ పైకి రావాలంటే మాత్రం సిన్మా చూసినంత ఈజీకాదని ఈ ఏడాదిన్నర కాలం నేర్పింది. అందుకే ఉత్తరాన్ని సుకుందానికి చూపించాను. వాడు కొంచెం బాధగానే "బెస్టాఫ్ లక్" చెప్పాడు.

"నీ పెళ్లికి ఎలాగైనా సిన్మా స్టార్స్‌ని తీసుకొస్తాన్రా. గ్లామరస్‌గా ఉంటుంది" అని భుజం తట్టి బస్సెక్కించాడు. నేను ఇంటికొచ్చి అమ్మాయిని చూసి క్లాప్ కొట్టాను.

ముహూర్తం షాట్ దగ్గర పడింది.

ఇంతలో విష్ణుమాయ చిత్రంలో ఏదో పాత్ర వేస్తున్నట్టు సుకుందం నించి లెటరొచ్చింది. "ఒకరిద్దరు సినిమా మొహాల్ని నీ పెళ్లికి తీసుకొస్తాను. మన లెవల్ అక్కడ పెరగాలి కదా. వాళ్లు రావడానికి ప్రొడ్యూసర్ లింగారావ్‌తో పైరవీ చేస్తున్నాను" అని రాశాడు.

నా పెళ్లి హడావిడి మొదలై మేం పెళ్లిపీటల మీద కూచున్నా సుకుందంగాడు రాలేదు. "ఏరా అన్నయ్య, నీ పెళ్లికి హీరోలు, హీరోయిన్లు వస్తారన్నావ్... ఎవరూ రాలేదేంటి?" అని తమ్ముడుగాడు శనిలా పీడిస్తూనే ఉన్నాడు. సుకుందంగాడి పైరవి ఫలించలేదనుకున్నాను. పెళ్లిపందిరంతా సందడిగా వుంది.

"అయ్యా... మీరేదో ఆలోచనలో మునిగినట్టున్నారు. ముహూర్త సమయం అయింది తాళి కట్టండి. బాజాలు మోగించండయ్యా" అని పురోహితుడు సాక్షి రంగారావ్ లెవల్లో అరిచాడు.

నేను దిగ్గున లేచి మూడు ముళ్లు వేస్తుంటే... ఆశ్చర్యం... అక్షింతల వర్షమే కురియలేదు. ఒక్కరూ అక్షింతలు వేయకుండానే బయటికి పరుగులు తీయటంతో కంగారుపడ్డాం పెళ్లికూతురు, నేను, పురోహితుడు.

తీరా విషయం ఏంటంటే... అప్పుడే సుకుందంగాడు ఒక ప్రముఖ హీరోని తీస్కొని కార్లో దిగాడట. అంతా అటువైపు పరిగెత్తారు.

పెళ్లిపందిరంతా గోల...గోల...

మమ్మల్ని పట్టించుకున్నవాళ్లే లేరు. అంతా హీరో చుట్టేమూగారు. మా ఆవిడ నావైపు కొరకొరా చూసింది మొదటిసారి, పెళ్లిపీటల మీదే...

ఇరవై నిమిషాల తర్వాత సుకుందం, హీరో మా దగ్గరికి వచ్చి అక్షింతలు వేశారు. సుకుందం నా చెవిలో "హీరోగార్ని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తీసుకువెళ్తానని ఒప్పించి, పెళ్లి కరీంనగర్లోనే కాబట్టి మధ్యలో ఇలా అక్షింతలు వేసి వెళ్దామని నచ్చచెప్పా... నేనూ, ప్రొడ్యూసర్ లింగారావు, హీరోగారి రాకతో, పెళ్లికళ బాగా వచ్చింది కదూ" అన్నాడు.

నేను నవ్వలేక నవ్వాను.

వచ్చినంత హడావిడిగానే వాళ్లు వేములవాడ వెళ్లిపోయారు. పెళ్లికి వచ్చిన వాళ్లంతా డైనింగ్‌హాల్ వైపు పరుగులు తీశారు.

"ఇకనించీ సిన్మా పిచ్చి తగ్గించుకోండి" దండలు సవరించుకుంటూ మా ఆవిడ మొదటి వార్నింగ్ ఇచ్చింది.

ఇక ఈ ఫ్లాష్‌బ్యాక్‌ని ఎండ్ చేస్తే... అర్నెల్ల తర్వాత మళ్లీ మా ఆవిడ డైలాగ్‌తో గబుక్కున లేచివచ్చి సిన్మా పేజీ తీశాను.

నిజమే... విష్ణుమాయ చిత్రంలో ఉత్తమ నటుడు సుకుందం.

నా దగ్గర ఆ సినిమా కాసెట్టు ఉండటంతో నోట్లో బ్రష్ అయినా వేసుకోకుండా క్యాసెట్ ప్లే చేశాను.

అంతా దేవతలు, రాక్షసులు కాబట్టి రిమోట్ చేతిలో పెట్టుకొని స్లోమోషన్‌లో అందరి ఫేసుల్ని తీక్షణంగా నాలుగ్గంటలు చూశాను.

మధ్యలో మొహం వాష్ చేసుకొని వచ్చి మళ్లీ చూశాను.

యజ్ఞాలు భంగం చేస్తున్న రాక్షసుల మొహాల్ని స్టిల్ బటన్ నొక్కుతూ చూశాను. అయినా సుకుందంగాడు ఆ సిన్మాలో కన్పించలేదు. వాడికి ఉత్తమ నటుడేంటని ఆశ్చర్యపోతుంటే... పదకొండింటికి వెదకపోయిన టైటిల్ కథలోనే తగిలినట్టు సుకుందం ఊడిపడ్డాడు. రాగానే మేం 'కంగ్రాట్స్ చెప్పి - "అసలీ సిన్మాలో నువ్వెక్కడున్నావురా" అనడిగాను.

"క్యాసెట్ ప్లేచెయ్... నా నటన చూపిస్తా" అన్నాడు.

టైటిల్స్ మొదలుకాగానే... "నా నటన క్లైమాక్స్‌లో ఉంది ఫార్వర్డ్ చెయ్" అన్నాడు.

సినిమా చివర్లో ఏమీ లేదు. పెద్దగా... భగవంతుడి విశ్వరూపం తప్ప.

"ఇంకెక్కడ్రా" అనడిగాను చిరాగ్గా.

"స్టిల్ నొక్కు" అన్నాడు వాడు. టీవీ స్క్రీన్‌మీద విశ్వరూపం అలాగే ఉండిపోయింది.

"అదెవరో తెల్సా" అన్నాడు.

"భలేవాడివి... విష్ణువేషం వేసింది అనిల్ ఘోష్ కదా"

"అవును కానీ ఆ విష్ణువుకి పదిచేతులున్నాయి చూశావా? కుడిపక్క చక్రాన్ని, ఎడమ పక్క శంఖాన్ని పట్టుకున్న చేతులెవరిలో తెల్సా... నావే" అన్నాడు.

"అదేంట్రా... అది నటనా?" అన్నాను.

"అవునుమరి... అందుకోసం ఆరుగంటలు నిల్చున్నాం"

"ఆ నటనకి అవార్డ్ ఎలా ఇచ్చార్రా బాబూ" అన్నాను తలబాదుకుంటూ.

"అదేమరి... రవిగాంచని చోట పైరవిగాంచున్... తెలీదా?" అనటంతో చివరికి లలితకళల్ని కూడా వైరస్‌లా తొలిచేస్తున్న రికమెండేషన్ 'పవర్'తో షాక్ తినటం నావంతయింది.